13న సామాజిక సాధికారత వారోత్సవాలు

సనత్‌నగర్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాంతీయ అధ్యయన కేంద్రంలో సామాజిక సాధికారత వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు రీజనల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ రామాచారి తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 13న ఉదయం 10 గంటలకు 'భారత రాజ్యాంగం–సామాజిక న్యాయం' అనే అంశంపై ఉపన్యాస కార్యక్రమం, అదే రోజున 11 గంటలకు 'భారత రాజ్యాంగ ప్రవేశికను ఎలా అర్థం చేసుకున్నారు' అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు ఉంటాయని పేర్కొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



రసూల్‌పురాలో వాటర్ క్యాంప్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ రెండవ వార్డు రసూల్‌పురాలో కాంగ్రెస్ నాయకులు షేక్ నయీం ఆధ్వర్యంలో ఏర్పాటైన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం ప్రారంభించారు. కంటోన్మెంట్ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు వాటర్ క్యాంప్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు శ్రీహరి, నాగేష్, అబ్దుల్ వాహబ్, షాహద్ అలీ, రేష్మ, అంజనేయులు, అజ్జు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని చారిత్రక ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. మోండా డివిజన్ శివాజీ నగర్ లో ఉన్న శ్రీ పెరుమాళ్ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన కుంభాభిషేకంలో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుమాళ్ వెంకటేశ్వర స్వామి ఆలయం 200 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన దేవాలయం అన్నారు.

వీధి బాలల హక్కుల పరిరక్షణకు చొరవ చూపాలి

బన్సీలాల్‌పేట్: వీధి బాలల హక్కులను కాపాడటానికి ప్రభుత్వం మరింత చొరవ చూపాలని పీపుల్స్ కలెక్టివ్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్స్ ప్రతినిధులు అనురాధ, అంబికలు డిమాండ్ చేశారు. బోలక్‌పూర్‌లోని ఎవర్‌గ్రీన్ కమ్యూనిటీహాల్‌లో శుక్రవారం సాయంత్రం అంతర్జాతీయ వీధి బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. కుటుంబాల మధ్య విభేదాలు, హింస, లైంగిక దాడులు ఇతరత్రా కారణాలతో అనేక మంది పిల్లలు ఇళ్లను వదిలి వీధులపై జీవించాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. వీరికి ఆశ్రయం, రక్షణ, విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక సదుపాయాలు అందించడంలో ప్రభుత్వాలు కీలకపాత్ర పోషించాలన్నారు.

బీజేపీ నేతల బస్తీ బాట



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ చీర సుచిత్ర, ఆకుల విజయ

బన్సీలాల్‌పేట్: విక్టోరియాగంజ్ బస్తీ, ఓల్డ్ బోయిగూడ ప్రాంతాల్లో శుక్రవారం బీజేపీ నాయకులు బస్తీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్తీ ప్రజలను కలిసి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాన్ని ప్రజలకు అందజేశారు. స్థానిక కార్పొరేటర్ చీర సుచిత్ర, మహంకాళి జిల్లా బీజేపీ అధ్యక్షులు భరత్ గౌడ్, ఆకుల విజయ, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్, సందీప్ వర్మ, నాయకులు ఎస్ఆర్ మల్లేష్, ఆకుల ప్రతాప్ పాల్గొన్నారు.

టీచర్‌పై విద్యార్థి దాడి

కేసు నమోదు చేసిన బేగంపేట్ పోలీసులు

సనత్‌నగర్: ఉపాధ్యాయుడిపై ఓ విద్యార్థి దాడి చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ సంఘటన జరిగింది. ఓ ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి (13) వార్షిక పరీక్షలు రాస్తున్నాడు. బుధవారం పరీక్ష రాస్తున్న సదరు విద్యార్థి పక్కనే కూర్చొన్న మరో విద్యార్థి జవాబు పత్రాలను చూసి రాయడాన్ని ఇన్విజిలేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న టీచర్ చూశారు. దీంతో ఆ విద్యార్థిని వారించి మరో రూమ్‌లో కూర్చోబెట్టి పరీక్ష రాయించారు. దీనిని అవమానంగా భావించిన ఆ విద్యార్థి పరీక్ష ముగిసిన తర్వాత ఉపాధ్యాయుడు బయటకు వెళ్లే క్రమంలో బడి గంట కొట్టే రాడ్‌తో దాడి చేశాడు. ఈ ఘటనలో సదరు ఉపాధ్యాయుడికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ఘటనపై టీచర్ బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. బాలుడిని జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు.

పూలేకు ఘన నివాళి

సామాజిక న్యాయం కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన గొప్ప నాయకుడు మహాత్మ జ్యోతి రావుపూలే అని వక్తలు కొనియాడారు. ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు శుక్రవారం సనత్‌నగర్, సికింద్రాబాద్,సనత్‌నగర్ నియోజకవర్గాల్లో జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. పూలే విగ్రహానికి, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు.



మహేంద్రాహిల్స్‌లో ఎమ్మెల్సీ మల్క కొమరయ్య



సనత్‌నగర్‌లో వెల్లాల రామ్మోహన్ తదితరులు



కార్పొరేటర్ చీర సుచిత్ర, బీజేపీ నేతలు



తార్నాక చౌరస్తాలో డిప్యూటీ మేయర్ శ్రీలతశోభన్‌రెడ్డి



బోయిన్‌పల్లిలో పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

హనుమాన్ జయంతికి పటిష్ట బందోబస్తు



చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్

చిలకలగూడ: హనుమాన్ జయంతి వేడుకలకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేపట్టామని చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు. ఠాణా పరిధిలోని ఆలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టామని, నిఘా బృందాలను రంగంలోకి దింపామన్నారు. నియమ నిబంధనలు పాటిస్తు, ప్రజలకు ఇబ్బంది కలగకుండా హనుమాన్ శోభయాత్ర శాంతియుతంగా, మతసామరస్యంతో జరుపుకోవాలన్నారు. మెట్టుగూడ, పద్మారావునగర్, చిలకలగూడ, నామాలగుండు, సీతాఫల్‌మండి తదితర ప్రాంతాల్లోని ఆలయాల వద్ద హనుమాన్ జయంతి వేడుకలు, ఏడు ప్రాంతాల్లో శోభయాత్రలు జరుగుతాయని వివరించారు. ఊరేగింపులు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, ఆలయ నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

గుడిసెలను తొలగిస్తే ఊరుకోం

అమీర్‌పేట: దాసారం బస్తీ గుడిసెల జోలికి వస్తే ఊరుకునేది లేదని రిక్షా పుల్లర్ల కుటుంబాలు హెచ్చరించారు. 40 ఏళ్లుగా ఒక్కడ బీకేగూడ దాసారంలో నివాసముంటూ రేషన్ కార్డులు, ఓటర్ ఐడీ,ఆధార్,కరెంటు బిల్లులు అన్ని కలిగి ఉన్నామని గుర్తు చేశారు. శుక్రవారం వ్యర్థాల సేకరణ అనంతరం మధ్యాహ్నం జనాలు పెద్ద ఎత్తున స్థలం వద్దకు చేరుకుని నిరసనను వ్యక్తం చేశారు. కోర్టు ఆదేశాలున్నాయంటూ స్థలం స్వా. దీనం చేసుకునేందుకు వచ్చిన ప్రైవేటు వ్యక్తులు రెండు రోజులు అవుతున్నా పత్రాలను బయట పెట్టడం లేదని ఆరోపించారు. ఈ విషయంలో పోలీసులను సైతం తప్పుదోవ పట్టించారని ఆరోపించారు.



స్థలం వద్ద గుమ్మిగూడిన గుడిసెల వాసులు

బీజేపీ నాయకుల విస్తృత పర్యటన



అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్

రాంగోపాల్‌పేట్: రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో శుక్రవారం బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు విస్తృతంగా పర్యటించారు. బస్తీ బాటలో భాగంగా డివిజన్ కార్పొరేటర్ చీర సుచిత్ర, బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు భరత్‌గౌడ్, సీనియర్ నాయకురాలు ఆకుల విజయ, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుల చీర శ్రీకాంత్ తదితరులు కలిసి డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆదయ్య మెమోరియల్ పాఠశాల తదితర ప్రాంతాల్లో చీపురు పట్టి వీధులను శుభ్రం చేశారు. అలాగే బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గౌతంరావ్ డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో పర్యటించి తదితరులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీజేపీ నాయకులు ఎస్ఆర్ మల్లేష్, గోపికిషన్, శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్, సందీప్ వర్మ, నరేంద్ర పాల్, అమర్‌నాథ్, నిర్మల, స్వప్న, మమత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ స్థాపన దివస్

సనత్‌నగర్: బీజేపీ 46వ స్థాపన దివస్ సందర్భంగా సనత్‌నగర్ డివిజన్‌లోని బూత్‌నెంబర్ 172 జైభారతి స్కూల్ చౌరస్తాలో ఆ పార్టీ జెండాను ఎగురవేశారు. బూత్ ఇన్‌చార్జి, బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఆకుల మహేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బాల నరసింహ, లింగంపల్లి నర్సింగరావులు అతిథులుగా హాజరై జెండా ఎగురవేశారు. నిరుపేదల సంక్షేమమే బీజేపీ ఏకైక ఎజెండా అన్నారు. దయానంద్, ఉమా, శ్రీనివాసరావు, సుమన్, కుషాల్, సుధాకర్, చంద్రకుమార్, నరేష్ పాల్గొన్నారు.



బీజేపీ స్థాపన దివస్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు..

కలుషిత నీటి సమస్యను పరిష్కరించండి



పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీలో కలుషిత జలాల సరఫరాను అరికట్టాలని కోరుతూ బీజేపీ నాయకులు జలమండలి బోయిగూడ సెక్షన్ మేనేజర్ సయ్యద్ సలీంను కలిసి విజ్ఞప్తి చేశారు. చాలా రోజుల నుంచి కలుషిత జలాల సరఫరా వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతూ అనారోగ్యాలకు గురవుతున్నారని చెప్పారు. బీజేపీ డివిజన్ అధ్యక్షులు మహేష్ అధ్వర్యంలో నాయకులు కేఎం క్రిష్ణ, వై. సురేష్, ఎ. శ్రీనివాస్, సత్యనారాయణ గౌడ్, వై. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఘనంగా బైశాఖి మేళా



వివరాలు వెల్లడిస్తున్న తెలంగాణ పంజాబీ సభ సభ్యులు

కంటోన్మెంట్: పంజాబీ సంప్రదాయాలు కాపాడటం, ఐక్యతను పెంపొందించడమే లక్ష్యంగా ఈనెల 13న గ్రాండ్ బైశాఖి మేళా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ పంజాబీ సభ అధ్యక్షుడు రవీందర్ సింగ్ సర్నా తెలిపారు. సికింద్రాబాద్ లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. హెచ్ఐసీసీ నోవోటెల్‌లో నిర్వహించే ఈ మేళాలో ప్రముఖ పంజాబీ గాయకుడు గురుదాస్ మాన్ లైవ్‌షో, పాటియాలకు చెందిన ప్రముఖ నృత్య బృందం ఆధ్వర్యంలో బాంగ్రా, గిద్దా ప్రదర్శన, చండీగఢ్ కు చెందిన శశి ధీమన్ హాస్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. మూడు నుంచి నాలుగు వేల మంది ఈ మేళాకు హాజరవుతారన్నారు. తెలంగాణ పంజాబీ సభ సలహాదారులు సురేందర్ పాల్ సింగ్ సలుజా మాట్లాడుతూ 1963లో స్థాపించిన తెలంగాణ పంజాబీ సభ ఆరు దశాబ్దాలుగా సాంస్కృతిక పరంగా, సమాజ సేవ పరంగా అభివృద్ధికి ఎంతో కృషి చేస్తోందన్నారు. తెలంగాణ పంజాబీ సభ ఉపాధ్యక్షులు ప్రేమ్ కుమార్ కపూర్, హరీష్ శేఠీ, ప్రధాన కార్యదర్శి జోగిందర్ సింగ్ ముజ్రాల్ తదితరులు పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థినికి చెక్కును అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు రామిరెడ్డి, జయలక్ష్మమ్మ దంపతులు

సనత్‌నగర్: సమాజానికి తమవంతు మేలు చేయాలనే ఉద్దేశంతో మునగాల నాగిరెడ్డి ఛారిటబుల్ ట్రస్ట్ నెలకొల్పినట్లు ట్రస్ట్ సభ్యులు మునగాల రామిరెడ్డి, జయలక్ష్మమ్మ దంపతులు స్పష్టం చేశారు. జెక్ కాలనీ వేదికగా ట్రస్ట్ తరుపున తెలుగు రాష్ట్రాల్లో ఎడ్యుకేట్–ఎంపవర్–ఎలివేట్ థీమ్‌తో తమ సేవలను విస్తృతం చేయనున్నట్లు తెలిపారు. గురునానక్ కళాశాలలో బీటెక్ విద్యనభ్యసిస్తున్న రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన రైతు బిడ్డ సౌమ్య చదువు నిమిత్తం ఒక ఏడాది ఫీజు రూ.35,000ల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిభ కలిగి ఆర్థికంగా చేయూత లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులకు, మహిళలకు భవిష్యత్తులోనూ సాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మునగాల మాధవరెడ్డి, నీలిమ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: చైత్రమాసం శుద్ధ పౌర్ణమి శ్రీహనుమాన్ జయంతి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్)లో స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఈఓ సత్యనారాయణనాయుడు తెలిపారు. ఉదయం 5.30 గంటలకు అభిషేకం, సింధూర పూజ, ప్రత్యేక అలంకరణ దర్శనం, సహస్రనామ నాగవల్లి (ఆకుపూజ), హారతి, తీర్థ ప్రసాద వితరణ, మధ్యాహ్నం వరకు అర్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం 7.30 గంటల నుంచి శ్రీహనుమాన్ కళా వేదిక వద్ద 108 సార్లు శ్రీహనుమాన్ చాలీసా పారాయణం, అనంతరం మహాప్రసాద అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

వైద్యవృత్తికి వన్నెతేవాలి



గాంధీలో గ్రాడ్యుయేషన్ డే వేడుకల దృశ్యం

- కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ వీసీ నందకుమార్‌రెడ్డి
- 'గాంధీ'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

గాంధీఆస్పత్రి: ఎంబీబీఎస్ డిగ్రీ పట్టాలు అందుకున్న వారంతా నైతిక విలువలు పాటించి వైద్య వృత్తికి వన్నె తేవాలని కాళోజీ నారాయణరావు హెల్త్ వర్సిటీ వైస్‌ఛాన్సలర్ నంద కుమార్‌రెడ్డి కోరారు. సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో గురువారం రాత్రి గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు సందడిగా నిర్వహించారు. ఎంబీబీఎస్ ఫైనల్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన 2019 బ్యాచ్‌కు చెందిన 245 విద్యార్థులకు డాక్టర్ డిగ్రీ పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...సామాజిక సేవాదృక్పథంతో నిరుపేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలన్నారు. రోగులతో ఆప్యాయంగా మెలగాలని సూచించారు. 2019 బ్యాచ్‌కు చెందిన విద్యార్థుల్లో 95 శాతం ఉత్తీర్ణత సాధించారని, గాంధీ కళాశాలకు చెందిన డాక్టర్ దుర్గం కావ్య తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ద్వారా గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమని గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇందిర అన్నారు. అనంతరం మెరిట్ విద్యార్థులకు బంగారు పతకాలు బహుకరించారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రాజకుమారి, ఆదిలాబాద్‌జిల్లా బోథ్ ఎమ్మెల్యే అనీల్‌జాదవ్, గాంధీ అలుమ్నీ అధ్యక్షుడు డాక్టర్ లింగమూర్తి, ప్రొఫెసర్ వాల్యా, రాజారామ్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.



కుటుంబసభ్యులతో సెల్ఫీ

సందడిచేసిన మెడికోలు

గాంధీ కాలేజీ ప్రాంగణంలో మెడికోలు సందడి చేశారు. డాక్టర్ పట్టా అందుకున్న ఆనందాన్ని కుటుంబసభ్యులు, సన్నిహితులు, బంధుమిత్రులతో పంచుకున్నారు. మరచిపోలేని మధురఘట్టాలను సెల్ఫీల రూపంతో సెల్‌ఫోన్లలో భద్రపరుచుకున్నారు.

బ్లిట్జ్‌క్రిగ్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఎంబీఏ విభాగంలో రెండు రోజుల పాటు జరిగే బ్లిట్జ్‌క్రిగ్–2025 శుక్రవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా రాష్ట్ర ఉన్నత విద్య మండలి ఛైర్మన్ ప్రొ.బాలక్రిష్ణారెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉన్నత విద్యావంతులు ఉద్యోగాలు చేడయం కాదని.. పది మందికి కల్పించే దిశగా ముందుకు సాగాలన్నారు. వీసీ ప్రొ.కుమార్, ప్రొ.జహంగీర్, ప్రొ.శ్రీరాములు, డా.సమున్నత, ప్రొ.వెంకటయ్య, ప్రొ.విద్యాసాగర్ పాల్గొన్నారు.

'రాజీవ్ యువ వికాసం' దరఖాస్తు గడువు పెంచాలి

లాలాపేట: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ యువతకు అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు సమర్పించే గడువు మరో 15 రోజుల పాటు పొడగించాలని షెల్డూల్డు కులాల సేవా సమితి గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు ఏ. చంద్రశేఖర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకానికి దరఖాస్తు సమర్పించే గడువు ఈ నెల 14తో ముగుస్తుందన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు మీసేవా, ఆన్ లైన్ కేంద్రాలకు వెళితే రెండు మూడు రోజుల నుంచి సర్వర్ గౌడ్ సమస్యతో ప్రజలు వెనుదిరుగుతున్నారని తెలియజేశారు. ధృవీకరణ పత్రాల జారీలో తహసీల్దార్ కార్యాలయాల్లో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు.